ఆర్‌టిసి కార్గో సర్వీసులు ప్రారంభం

పెనుమంట్ర: తక్కువ వ్యయంతో సకాలంలో సరుకులు, వస్తువులు సురక్షితంగా చేరవేయడం ఆర్‌టిసి కార్గో ద్వారా సాధ్యమని నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్, అంతర్జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారులు సత్తి సుబ్బన్న రెడ్డి అన్నారు. శుక్రవారం మార్టేరులోని కోడేరు రోడ్‌లో గల ఆర్యే కాంప్లెక్స్ సందు ఆర్‌టిసి కార్గో సర్వీసులను ఆయన ప్రారంభించారు. మార్టేరు పరిసర ప్రాంతాలలోని సుమారు 30 గ్రామాల ప్రజలు కార్గో కొరియర్ సర్వీసులు, బస్ రిజర్వేషన్ సేవలను మార్టేరులోనే పొందవచ్చని అన్నారు. మార్టేరు నుంచి పాలకొల్లు, భీమవరం, తణుకు, రాజమండ్రి మాత్రమే కాకుండా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు లాంటి దూర ప్రాంతాలకు కూడా ఆర్‌టిసి కార్గో సేవలు, కొరియర్ సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. స్థానిక కార్గో ఏజెంట్ బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్టేరు పరిసర ప్రాంత ప్రజలు కార్గో సేవలను, బస్ రిజర్వేషన్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

వైసిపికి ఎదురుదెబ్బ..!

మాజీ మంత్రి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని రాజీనామా
ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు లేఖ
వైసిపి నాయకులు, కార్యకర్తల్లో షాక్
పదవులు అనుభవించి.. కష్టకాలంలో తప్పుకోవడంపై విమర్శలు
జనసేనలో చేరనున్నట్లు ప్రచారం ?
నాని బాటలో మరికొందరు నాయకులు రాజీనామా అంటూ చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో వైసిపికి గట్టి ఎదురుదెబ్బ తగలింది. ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలూ కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని గట్టి షాక్ ఇచ్చారు. ఏలూరు జిల్లా అధ్యక్ష, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవులకు రాజీనామా చేస్తూ శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాయడం జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. 'వ్యక్తిగత కారణాలతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నానని, ఏలూరు జిల్లా అధ్యక్ష నియోజకవర్గ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్లు ఆయన లేఖలో పేర్కొన్నారు.'. వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మాత్రం ఆయన లేఖలో పేర్కొనలేదు. రాజీనామా లేఖ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగడం తప్ప ఆయన నేరుగా ప్రకటించకపోవడంతో వాస్తవమా.. కాదా అన్న సందిగ్ధత అందరిలోనూ నెలకొంది. ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో నిర్ధారణ కోసం ఆ పార్టీ నాయకులు, ఆళ్లనాని అనుయాయులకు ఫోన్లు చేసి కనుక్కునేందుకు ప్రయత్నం చేశారు. వాస్తవమని తేలడంతో నాని హఠాత్తుగా రాజీనామా నిర్ణయం తీసుకోవడంపై జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆళ్లనాని రాజీనామాపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచే కాకుండా జనాల నుంచి సైతం తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి పదవులు అనుభవించి కష్టకాలంలో పార్టీని వీడుతారంటూ అంతటా చర్చ కొనసాగుతోంది. 2004, 2009లో కాంగ్రెస్‌లో ఏలూరు ఎంఎల్‌ఎగా గెలుపొందిన ఆళ్లనాని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత జరిగిన

పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి 2013లో వైసిపిలో చేరారు. 2014 ఎన్నికల్లో ఏలూరు వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. తర్వాత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షునిగా, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవులు నిర్వహించారు. 2017లో శాసన సభ్యుల కోటాలో వైసిపి ఎంఎల్‌సిగా ఎన్నికయ్యారు. 2019 జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏలూరు ఎంఎల్‌ఎగా గెలుపొందారు. డిప్యూటీ సిఎం, ఆరోగ్యశాఖ మంత్రి పదవులు అనుభవించారు. జిల్లాల విభజన తర్వాత ఏలూరు జిల్లాకు అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గడిచిన ఎన్నికల వరకూ ఆళ్ల నాని జిల్లా అధ్యక్షునిగా, ఏలూరు ఎంఎల్‌ఎగా కొనసాగారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీచేసి భారీ ఓటమిని చవిచూశారు. అప్పటి నుంచి ఆయన రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. విశాఖలోనూ, బెంగుళూరులోనూ ఉంటున్నట్లు జోరుగా ప్రచారం సాగింది. ఏలూరు నియోజకవర్గంలో టిడిపి నాయకుల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలకు తీవ్ర ఇబ్బందులు ఎదురైన సమయంలోనూ ఆయన వారికి అండగా నిలబడకుండా వెళ్లిపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

పదవులు అనుభవించి కష్టకాలంలో హ్యాండ్

వైసిపిలో పెద్దపెద్ద పదవులు అనుభవించిన ఆళ్ల నాని ఎన్నికల్లో పార్టీ ఓటమి చెంది కష్టకాలంలో ఉన్నప్పుడు రాజీనామా చేయడంపై ఆ పార్టీ నేతల్లో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. జగన్ ఎవరికీ ఇవ్వనంతగా నానికి అవకాశాలు ఇచ్చారని, ఆయన ఇలా చేయడం ఏంటన్న ప్రశ్న పార్టీ నాయకులను, కార్యకర్తలను వేధిస్తోంది. నాని రాజీనామా చేసినట్లు తెలిసి ఆయనను నమ్ముకుని రాజకీయాలు చేసిన తమను నట్టేట ముంచేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క టిడిపి నాయకుల నుంచి తీవ్ర ప్రతిఘటన కొనసాగుతున్న తరుణంలో నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉండకుండా రాజీనామా చేయడంపై సర్వత్రా చర్చ కొనసాగుతోంది. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయకపోవడంతో ఎన్నికల తరుణంలో మళ్లీ నాని వచ్చే అవకాశం ఉందన్న చర్చ సైతం నడుస్తోంది. ఎన్నికల్లో ఓటమి తర్వాత 2014-19 మధ్యకాలంలోనూ ఆయన జిల్లాలో పెద్దగా ఉండలేదు. ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నప్పుడు వచ్చి బెంగుళూరు వెళ్లిపోతున్నారని చర్చ సాగేది. అయినప్పటికీ జగన్ ఆయనకు పదవుల విషయంలో పెద్దపీట వేసిన పరిస్థితి కొనసాగింది. పార్టీకి సంబంధించిన జోనల్ పదవి వంటివి నానికి ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ సైతం మరోపక్క నడుస్తోంది.

నానిబాటలో మరికొందరు నాయకులు?

ఎన్నికల్లో ఓటమి తర్వాత జిల్లాలో మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎలతోపాటు పెద్దనాయకులు ఎవరూ బయటకు రాని పరిస్థితి నెలకొంది. జిల్లాను వరదలు ముంచెత్తినా ప్రజల వద్దకుగానీ, రైతుల వద్దకుగానీ, వైసిపి నాయకులు ఒక్కరు కూడా వెళ్లలేదు. రైతుల కష్టాలపై ఒక్క ప్రకటన కూడా విడుదల చేయలేదు. నాని బాటలోనే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మరికొందరు నాయకులు వైసిపి రాజీనామా చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. నాని బాటలో మరికొంతమంది నాయకులు రాజీనామా చేస్తే వైసిపికి మరింత పెద్దదెబ్బ తగిలే పరిస్థితి ఏర్పడనుంది. పార్టీ అగ్రనాయకత్వం ఏవిధమైన చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

జనసేనలోకి ఆళ్ల నాని?

వైసిపికి రాజీనామా చేసిన ఆళ్ల నాని జనసేనలో చేరనున్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. ఏలూరు నియోజకవర్గంలో జనసేనకు మంచి పట్టు ఉన్న పరిస్థితి నెలకొంది. దీంతో ఆయన జనసేనలో చేరి రాజకీయాల్లో కొనసాగుతారన్న చర్చ సాగుతోంది. నాని స్వభావం రీత్యా వేరే పార్టీలోకి వెళ్లే అవకాశం లేదని, వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయలేదు కాబట్టి ఎన్నికల సమయంలో మళ్లీ వచ్చే అవకాశం ఉందని మరో చర్చ నడుస్తోంది.

జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కౌలు రైతులు

ధాన్యం డబ్బులు చెల్లించాలి

కౌలు రైతు, రైతు సంఘాల ఆధ్వర్యాన రాస్తారోకో

ప్రజాశక్తి - నరసాపురం

రైతులకు ధాన్యం డబ్బులు తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి కౌలు రైతు, రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నరసాపురం 216 జాతీయ రహదారిపై చిట్టవరం వద్ద కౌలురైతులు రాస్తారోకో చేపట్టారు. మూడు నెలలైనా ధాన్యం డబ్బులు ఇవ్వలేదని, ధాన్యం సొమ్ము వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో అరగంట సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో సంఘటనా స్థలానికి నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాస్, సిఐ, నరసాపురం, పాలకొల్లు రూరల్ ఎస్ఐలు రాస్తారోకోను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనంతరం కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు, రైతులు పోలీసు అధికారులతో మాట్లాడారు. ఉన్నతాధికారులు వచ్చి డబ్బులు ఎప్పుడు వేస్తారో సరైన సమాధానం చెబితే గానీ ఆందోళన విరమించబోమన్నారు. ఆందోళన వద్దకు చేరుకున్న ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ చేరుకుని రైతులతో మాట్లాడారు. రైతులు శాంతించకపోవడంతో ఆర్‌డిఒ పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్‌తో మాట్లాడారు. దీనిపై శివరాంప్రసాద్ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులుతో మాట్లాడారు. సోమవారం సాయంత్రానికి కచ్చితంగా ధాన్యం సొమ్ము చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు కవురు శ్రీనివాసు, పిల్లి కామేశ్వరరావు, తానుకొండ సీతారామకృష్ణ, రైతులు మద్దిశెట్టి నాగేశ్వరరావు, నెక్కంటి శ్రీనివాసు, చిట్టినీడి వెంకటేశ్వరరావు, ఇప్పా ఆదినారాయణ, కొరా సూర్యారావు, మార్టిన్, కేసు సత్యనారాయణ, గుబ్బల శ్రీనివాసు, బాలం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నాడు క్విట్ ఇండియా నేడు క్విట్ కార్పొరేట్

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసనలు

భీమవరంలో నిరసన తెలియజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

నాడు తెల్లదొరల నుంచి దేశాన్ని రక్షించుకుందామని ఇచ్చిన పిలుపు నేడు నల్ల దొరల నుంచి దేశాన్ని రక్షించుకుందాం అనే వరకూ సాగుతోందని రైతు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరంలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ నినాదంతో దేశంలో కార్మిక, కర్షక, శ్రమజీవులను రక్షించుకుందామంటూ నినదించారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు మాట్లాడుతూ దేశాన్ని పాలించమని అధికారం ఇస్తే నరేంద్ర మోడీ కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. దీనివల్ల కార్మిక, కర్షక, శ్రామిక ప్రజలందరూ ఉపాధి, గిట్టుబాటు ధర, కనీస వేతనాలు లేక, ధరలు భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతుల నడ్డి విరిచే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని, రైతుల ఆందోళనతో వెనక్కి తీసుకుందని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, రైతు నాయకులు ఆనంద్, శ్రామిక మహిళ నాయకురాలు డి.కళ్యాణి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పినప్పటికీ తన పాలనలో ఎలాంటి మార్పూ లేకపోవడం దారుణమన్నారు. ప్రజలను రెచ్చగొట్టి నిర్బంధాలకు గురిచేస్తే ఏమవుతుందో పక్క దేశాల అనుభవం ఇప్పటికే కనపడుతోందన్నారు. అనంతరం క్విట్ ఇండియా స్థూపం వరకూ ర్యాలీ చేసి అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేలబోయిన రంగారావు, సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు, గొర్ల రామకృష్ణ, ఇంజేటి శ్రీనివాస్, త్రిమూర్తులు, సిహెచ్ వెంకటేశ్వరరావు, మల్లుల సీతారాం ప్రసాద్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: క్విట్ ఇండియా ఉద్యమంలో ఆనాడు రైతులు, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఎంతో కృషి చేశారని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా

తాడేపల్లిగూడెంలో..

ఉపాధ్యక్షులు రంగారావు, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా తాడేపల్లిగూడెం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీసు ఐ ల్యాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో, క్విట్ కార్పొరేట్ నినాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాలన్నారు.

తణుకులో..

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి ఘటించాలని, రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక ప్రజా అనుకూల విధానాల కోసం పోరాడాలని, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను, యాండ్రపు కృష్ణ, నరమాల కృష్ణ, చల్లా చంద్రరావు, చిటికిన రాము, పోతు శ్రీను, వెంకట దుర్గారావు, పి.నాగేంద్రబాబు, గొర్రెల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

తణుకు : కార్పొరేట్ కనుసన్నల్లో నడుస్తున్న మోడీ పాలన పోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. స్థానిక పైడిపర్రు బాయ్స్ స్కూల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో క్విట్ ఇండియా డే సందర్భంగా క్విట్ కార్పొరేట్ అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ వీరుల త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్యాన్ని మోడీ నాశనం చేస్తున్నారని విమర్శించారు. భారతదేశం నుండి కార్పొరేట్ పాలన పోయేంతవరకూ ప్రజలు పోరాటం సాగించాలన్నారు. మోడీ కార్పొరేట్ విధానాలను ఆపాలని లేకుంటే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్.ఆదినారాయణబాబు, శీలబోయిన శ్రీనివాస్, నందివాడ చిన్నారావు, గుబ్బల గోపి, జ్యోతిబాబు, అనంతలక్ష్మి, బంగారమ్మ, గంగాధరం, శ్రీను పాల్గొన్నారు.

గిరిజనులు జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలి

ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

గిరిజనులు ఉన్నత చదువులతో అభివృద్ధి చెంది జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన కుటుంబాలు వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. చదువు ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధించగలమన్నారు. వెనుకబాటు తనం పోయి సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. వారు అభివృద్ధి చెందడంతో ఆయా కుటుంబాల జీవన ప్రమాణాలు కూడా మెరుగవుతాయన్నారు. గిరిజన ప్రాంతంలో తాను ఉద్యోగం చేశానని, వారి జీవనశైలి, స్థితిగతులపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. పలువురు గిరిజన నాయకులు మాట్లాడుతూ జీలుగుమిల్లి, పోలవరం, బుట్టాయగూడెం ఐటిడిఎ పరిధిలోని మండలాల వారినే ఎస్‌టిలుగా గుర్తించి పరిగణలోకి తీసుకుంటున్నారని, ఈ జిల్లాలోని మైదాన ప్రాంతం గిరిజనులకు ఎటువంటి ప్రభుత్వ రాయితీలు, పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పించడం లేదని ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులులాగే తమకు కూడా ప్రభుత్వం నుంచి పొందే అన్నీ అవకాశాలనూ కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆధార్ కార్డులకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన కుటుంబాల్లో చదువుకున్న వారి పూర్తి వివరాలను వెంటనే అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, బిసి సంక్షేమ శాఖ అధికారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతిరావు, జిల్లా వైద్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి బి.పిచ్చియ్య, జిల్లా గిరిజన పరిరక్షణ హక్కుల అధ్యక్షులు కూతాడి శ్రీనివాసరావు, జిల్లా గిరిజన విభాగం నియోజకవర్గాల అధ్యక్షులు సాలా మల్లేశ్వరరావు, కూతాడి నాగేశ్వరరావు, మానుపాటి సత్తిబాబు, బండి తాతాజీ, సాలా నరసయ్య, యానాదుల సంఘం అధ్యక్షులు తోట రంగయ్య పాల్గొన్నారు.

టోల్ ఛార్జీల ప్రతిపాదనను విరమించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

భీమవరం: రాష్ట్ర రహదారులపై టోల్ ఛార్జీల ప్రతిపాదనను విరమించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. వాహనదారుల నుంచి వెయ్యి కిలోమీటర్ల పరిధిలో టోల్ ట్యాక్సులు వసూలు చేయాలని ప్లాన్ సిద్ధం చేయమని కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రిగా ఆదేశించినట్లుగా తెలిసిందని, ఈ చర్య ఆందోళన కల్గిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర రహదారులపై పన్ను వసూలు చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో ల్యెఫ్‌టాక్స్, రోడ్ ట్యాక్స్, గ్రీన్‌ట్యాక్స్, డీజిల్, పెట్రోల్‌పై సెస్సు వంటి రూపాలలో ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుతోందన్నారు. గత ప్రభుత్వం ఈ ట్యాక్సులను విపరీతంగా పెంచిందని, అది భరించలేక వాహనదారులు లబోదిబోమంటుంటే మళ్లీ వాహనదారులపై టోల్ ట్యాక్సులు వసూలు చేయడమంటే ప్రజలపై విపరీతమైన భారం మోపినట్లేనని అన్నారు. ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఆందోళన చెందుతుంటే మళ్లీ కొత్తగా టోల్‌ట్యాక్సులు వసూలు చేస్తే, రవాణా రంగంపై భారంపడి, తత్ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు ఇంకా పెరుగుతాయే తప్ప తగ్గవని బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసిపి ప్రభుత్వం కేంద్రం చెప్పినట్లుగా తలొగ్గి ప్రజలపై చెత్తపన్ను, రిజిస్ట్రేషన్ల ట్యాక్సులు, ఆస్తిపన్ను, విద్యుత్ చార్జీలు పెంచి వసూలు చేసిందన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్టు తీసుకువచ్చిందని ఫలితంగా ప్రజల వ్యతిరేకతను వైసిపి ప్రభుత్వం సవిచూసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోవాలన్నారు. ప్రజలపై ఎలా భారాలు తగ్గించాలో ఆలోచించాలి తప్ప కొత్తపన్నులు వేసే ఆలోచనను విరమించుకోవాలని కోరారు.

సబ్ జైళ్ల తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ జైల్‌ను శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తనిఖీ చేశారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు తదితర విషయాలను ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. జైల్ ముద్దాయిలకు నియమించబడిన లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ అందరూ బాధ్యతగా పనిచేయాలని ఈ సందర్భంగా మాట్లాడారు. వంటశాల, స్టోర్ రూంను తనిఖీ చేశారు. జైల్ ప్రాంగణంలో ఏర్పాటు చేయబడిన ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది కె.శిరీష, పిఎల్‌వి.వరలక్ష్మి, ఉచిత న్యాయ సలహా దారుడు విహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు: న్యాయసేవల సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు పొందవచ్చునని సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ సూచించారు. శుక్రవారం రాష్ట్ర న్యాయసేవల సంస్థ ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్వహించే 6వ వార్డులో బాల సదన్, సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ బాల సదన్‌ను సందర్శించి బాలలకు అందుతున్న ఆహార, వసతిపై ఆరాతీశారు. పిల్లలకు సంబంధించిన రిజిస్ట్రర్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో జైలు క్లినిక్ న్యాయవాది చింతపల్లి నాగేశ్వరరావు, ప్యానెల్ న్యాయవాదులు ఎ.అజయకుమార్, కొల్లి ఆనంద్‌కుమార్, జగిలంక శివ, తిర్రే సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో ప్రగతి కనిపించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలలో మెరుగైన ప్రగతి కనిపించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలలో వేగం పుంజుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేదని, ఇసుక కారణంగా నిర్మాణాలు జరగడం లేదనే సమస్య ఉత్పన్నం కాకూడదన్నారు. ఇప్పటికే జిల్లా గనుల, భూగర్భ శాఖ అధికారికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, ఏదైనా సమస్య ఉంటే వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారుల గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మండల అభివృద్ధి అధికారులు, మండల తహశీల్దార్‌లు గృహ నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కాలనీలో అంతర్గత రోడ్లను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పిడి పి.పిచ్చయ్య, నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బివి.రమణారావు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహంపై దాడికి నిరసన

తణుకు: 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ శిలాఫలకంపై దాడిచేసి, ధ్వంసం చేసిన దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని తణుకు బార్ అసోసియేషన్ సెక్రటరీ ఈదా రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ హాల్ వద్ద విజయవాడలోని స్వరాజ్ మైదానంలో గురువారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 125 అడుగుల విగ్రహంపై జరిగిన దాడిని న్యాయవాదులు ఖండించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది పొట్ల సురేష్ మాట్లాడుతూ మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు అందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, గొల్లపల్లి అంబేద్కర్, టి.నెహ్రూ, ప్రభాకర్, చింతపల్లి నాగేశ్వరరావు, పి.డేవిడ్, ఎస్‌కె బాజ్జి పాల్గొన్నారు.

పాలకొల్లు : విజయవాడ నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ సామాజిక మహా శిల్పం వద్ద నామఫలకంలోని అక్షరాలను రాత్రి దుర్మార్గంగా ధ్వంసం చేసిన నేపథ్యంలో వైసిపి నేతలు పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించి నిరసన తెలిపారు. మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, ఖండవల్లి వాసు, ఉచ్చుల స్టాలిన్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్: గురువారం అంబేద్కర్ 125 అడుగుల విగ్రహంపై దుండగులు చేసిన దాడి ఆయనను అవమానించడమేనని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి అన్నారు. వైసిపి ఆధ్వర్యాన నిరసన తెలిపారు. దళిత నాయకులు బోకూరి విజయరాజు, భలే ఏసుబాబు పాల్గొన్నారు.

ఇసుక అవసరం మేరకే పొందాలి : కలెక్టర్

భీమవరం: జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేవని, పొరుగు జిల్లాల నుంచి ఇసుకను లబ్ధిదారులు అవసరం మేరకు పొందవచ్చునని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలు చెల్లించి ఇసుకను ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రు, పెండ్యాల, నిడదవోలు మండలం పందలపర్రు స్టాక్ పాయింట్లు వద్ద రూ.270 లు, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు-1, 2 స్టాక్ పాయింట్ల వద్ద రూ.265ల టన్ను ఒక్కింటికి చెల్లించి అందుబాటులో వున్న ఇసుకను పొందవచ్చు అన్నారు. ప్రతిరోజు ఏఏ జిల్లాల్లో, ఏఏ స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లభ్యంగా ఉందో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

వ్యాపార రంగంలో భీమవరం అభివృద్ధి : ఎంఎల్‌ఎ

భీమవరం టౌన్: వ్యాపార రంగంలో భీమవరం అభివృద్ధి చెందుతుందని, ఎన్నో వ్యాపార రంగాలు భీమవరంకు తరలివస్తున్నాయని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. బైపాస్ రోడ్డులోని బివి రాజు విగ్రహం వద్ద నూతన సిరి బిర్యానీ పాయింట్‌ను, ఆర్‌టిసి డిపో దగ్గర నూతన సత్య ఫ్రూట్ జ్యూస్ సెంటర్‌ను ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో భీమవరం ఒకటని, రానున్న రోజుల్లో మరెన్నో వ్యాపార సంస్థలు కూడా తరలిరానున్నాయని అన్నారు. నూతన వ్యాపారాలు అభివృద్ధి సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, కారుమూరి నాగేశ్వరావు పాల్గొన్నారు.

వినేష్ ఫోగట్‌కు న్యాయం చేయాలి : డివైఎఫ్‌ఐ

ఆచంట: 2024 ప్యారిస్ ఒలంపిక్స్‌లో భారతీయ రెజ్లింగ్ క్రీడాకారిణి వినేష్ ఫోగట్‌కు జరిగిన అన్యాయంపై దేశ ప్రజానీకం యావత్తూ ఐక్యంగా పోరాడాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్ శర్మ, జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి చంటిబాబు పిలుపునిచ్చారు. వినేష్ ఫోగట్‌కు సంఘీభావంగా శుక్రవారం స్థానిక సంతమార్కెట్ వద్ద గల ప్రభుత్వ ఐటిఐ కళాశాల వద్ద విద్యార్థులు, క్రీడాకారులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శర్మ, చంటిబాబు మాట్లాడుతూ ప్యారిస్ ఒలంపిక్స్ క్రీడల్లో వంద గ్రాముల అధిక బరువు నెపంతో వినేష్ ఫోగట్‌ను ఏకపక్షంగా అనర్హురాలిగా ప్రకటించడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇది కేవలం ఫోగట్‌పైన మాత్రమే కాదు యావత్ ప్రపంచ క్రీడాకారుల క్రీడా స్ఫూర్తిపై దాడిగా అభివర్ణించారు. అంతర్జాతీయ క్రీడా వనికపై భారతీయ మహిళా రెజ్లర్‌కు ఘోర అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఫోగట్, సాక్షి మాలిక్, ఇతర క్రీడాకారులతో కలసి భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ భారతీయ రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీ నడివీధుల్లో అప్రతిహతంగా పోరాడారని, ఆ నిరసనలను గమనంలో ఉంచుకొని కక్షసాధింపు చర్యగా ఫోగట్‌పై ఇటువంటి ఏకపక్ష బహిష్కరణ చర్యలు తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడి తేజ, మనశ్వి ఆర్‌ఎంసి కుమార్ అరిగేల సురేష్, పల్లపు రాజు, దుర్గాప్రసాద్, సిహెచ్.స్వరూప్ పాల్గొన్నారు.

రైతులు విత్తనాలను వినియోగించుకోవాలి

నరసాపురం: నష్టపోయిన ప్రతి రైతు విత్తనాలను వినియోగించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ.అనిల్ కుమారి కోరారు. నరసాపురం మండలంలోని రుస్తుంబాద, సీతారామపురం గ్రామాల్లో అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మైలాబత్తుల సోని, రుస్తుంబాద సర్పంచి బందెల రవీంద్ర భారతి, పులపర్తి ప్రతాప్, ఆకన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న విద్యార్థులు

సర్వోదయ స్ఫూర్తి అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బిన అమిరం నందు స్ఫూర్తి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం పాఠశాల హెచ్‌ఎం వి.అనురాధ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్ట్ అధినేత పద్మశ్రీ డాక్టర్ ఎంఆర్.రాజు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తయారు కావాలని, బట్టీపట్టి మార్కులు సంపాదించడం కన్నా అవగాహనతో సమాజాన్ని అర్థం చేసుకొని మంచి సమాజం నిర్మించడానికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్వోదయమండలి, వసుధా ఫౌండేషన్ కన్వీనర్ ఐ.ప్రసాద్ రాజు, రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఆకివీడు: మధ్యాహ్న భోజనంలో ఏవిధమైన సమస్యలు వచ్చినా వెంటనే తమకు తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ పరీక్షల నిర్వహణ జిల్లా సహాయ సంచాలకులు ఎంఎన్.సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ భోజనాల గురించి సమస్యలు ఉంటే తనకు చెప్పాలని విద్యార్థులకు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ గురించి ప్రతిఒక్కరూ పూర్తిగా ముందుగా తెలుసుకోవాలని చెప్పారు. అనంతరం భోజన శాలలోని భోజనాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఇఒ సీతారామయ్య పాల్గొన్నారు.

15న ఆటల పోటీలు

నరసాపురం: నరసాపురం నియోజకవర్గ మదర్ థెరిస్సా వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న నరసాపురం పట్టణంలో జిల్లాస్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నామని ఆ సంఘ అధ్యక్షుడు చిక్కాల వాసు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే ఆసక్తి ఉన్నవారు ఈనెల 12వ తేదీ లోపు ఈ నెంబర్ 98480 26302ను సంప్రదించాలని సూచించారు.

మోషేను రాజును కలిసిన సిఐ

భీమవరం టౌన్: పోలీసుల బదిలీల్లో భాగంగా భీమవరం టూ టౌన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన కాళీ చరణ్ శుక్రవారం ఎంఎల్‌సి ఛైర్మన్ మోషేను రాజుని గునుపూడిలో ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. మోషేన్ రాజు సిఐని అభినందించి పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆదిత్యలో బ్లూ డే వేడుకలు

నరసాపురం: నరసాపురం ఆదిత్య పాఠశాలలో శుక్రవారం బ్లూడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కిండర్ గార్టెన్ విద్యార్థులు బ్లూ కలర్ డ్రస్ ధరించి పాఠశాలకు హాజరై అలరించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్‌వి.రాఘవరెడ్డి మాట్లాడుతూ బ్లూ కలర్ నమ్మకానికి, విధేయతకు, జ్ఞానమునకు, విశ్వాసానికి, తెలివికి ప్రతీక అన్నారు. అనంతమైన ఆకాశము నీలిరంగులోను, అనంతమైన సముద్రపు నీరు నీలిరంగులోను అలాగే కొన్ని రకాల చేపలు, కూరగాయలు, మొదలైన వాటిలో నీలిరంగుకు గల ప్రాముఖ్యతను వివరించారు. ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శివకోటప్రసాద్ మాట్లాడుతూ ఇంద్రధనస్సులోని రంగులలో నీలి రంగు ప్రత్యేకమైనదని, నిత్య జీవితంలో బ్లూ కలర్ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి.ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

పింఛన్ల పంపిణీ నిబంధనలను సడలించాలి

ఆకివీడు: ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ నిబంధనలను సడలించాలని వికలాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి నటరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వికలాంగులకు అందజేసే పింఛన్ల పంపిణీకి నిబంధనలు పలు అంశాలకు అడ్డంకిగా మారాయన్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో ఇంటి వద్ద అందుబాటులో లేని వారికి 7వ తేదీ వరకు సచివాలయం వద్ద ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. వైద్య సహాయం కోసమో, ఇతర అవసరాల కోసమో పొరుగూరు వెళ్లిన వారికి ఈ అవకాశం ఉపయోగపడుతుందన్నారు. ఏదైనా ఇతర కారణాలరీత్యా ఒక నెలలో పింఛన్ తీసుకోని వారికోసం రెండో నెల పింఛన్ కలిపి రెండో నెలలో అందించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. తమ పరిస్థితిని ప్రభుత్వం గమనించి ఆదుకోవాలని కోరారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు

పాలకొల్లు: ఈనెల 17వ తేదీన పాలకొల్లు బార్ అసోసియేషన్ జరగబోయే ఎన్నికలకు శుక్రవారం ఎన్నికల అధికారి కర్రి యోహాను, సహాయ ఎన్నికల అధికారి డివిఎస్ గోపాలకృష్ణ వద్ద పలువురు న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రెసిడెంట్ పదవికి ఐదుగురు, వైస్ ప్రెసిడెంట్ పదవికి ఇద్దరు, జనరల్ సెక్రటరీ పదవికి ముగ్గురు, జాయింట్ సెక్రటరీ పదవికి ముగ్గురు, ట్రెజరర్ పదవికి ఒకరు, స్పోర్ట్స్ సెక్రటరీ పదవికి ఒకరు, లైబ్రరీ సెక్రటరీ పదవికి ఒకరు, మెంబర్స్ పదవికి ఐదుగురు, మహిళా ప్రతినిధి పదవికి ఒకరు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలను ఈనెల 12వ తేదీ సోమవారం సాయంత్రం 4.30 నిమిషాలకు తెలియపరుస్తామని ఎన్నికల అధికారి కర్రి యోహాన్ తెలిపారు.

గూడూరి సోదరులకు మాతృవియోగం

భీమవరం టౌన్: టిడిపి నాయకులు, 6వ వార్డు మాజీ కౌన్సిలర్ గూడూరి రామకృష్ణ, భీమవరం పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు తల్లి గూడూరి వీరమ్మ(90) శుక్రవారం మృతి చెందారు. వీరికి ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉండగా గూడూరి రామకృష్ణ 6వ వార్డు మాజీ కౌన్సిలర్, గూడూరి సుబ్బారావు భీమవరం పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మి, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, టిడిపి అంగన్వాడీ ద్వారా సంఘం ప్రధాన కార్యదర్శి కొల్లా నారాయణమూర్తి, టిడిపి కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వెంట్ర శ్రీనివాస్, భీమవరం పట్టణ టిడిపి అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

దొడ్డిపట్లలో 11న మెగా వైద్యశిబిరం

పాలకొల్లు: యలమంచిలి మండలం దొడ్డిపట్ల జెడ్‌పి హైస్కూల్లో ఈనెల 11న ఆదివారం యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేడుకొండ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ శిబిరం నందు కిమ్స్ మాతృ వ్యాధి నిపుణులు యాతం రంగా, చర్మ వ్యాధి నిపుణులు జక్కంపూడి సుభాషిణి, పీడియాట్రిస్ట్, కేన్సర్ నిర్ధారణ వ్యాధి నిపుణులు కుసుమ ప్రసూనాంబ, దంత వ్యాధి నిపుణులు కావలి మానిని, కిమ్స్ హాస్పిటల్ నుంచి ఎండి జనరల్, నేత్ర వ్యాధి నిపుణులు సేవలు అందిస్తారని తెలిపారు. బిపి, షుగర్ అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆదివాసీలను ప్రభుత్వం ఆదుకోవాలి

పెనుమంట్ర: ఆదివాసీలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎరుకుల సంక్షేమ సంఘ రాష్ట్ర కోశాధికారి బండి ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎరుకుల సంక్షేమ సంఘం పెనుమంట్ర మండల శాఖ అధ్యక్షుడు బండి రాంబాబు ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం బ్రాహ్మణ చెరువు మార్కెట్ యార్డ్ నందు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కోశాధికారి బండి ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీలు ప్రకృతి ప్రేమికులని, ప్రాచీన సంస్కృతికి సాంప్రదాయాలకు నిలువుటద్దంగా ఉన్న ఆదివాసీలు నేడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని అన్నారు. విద్య, ఆరోగ్యం, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లేకుండా వారు ఉన్నారని, వీరి విషయంలో ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో కూరగాయల సాగు

వీరవాసరం: ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రతిఒక్కరూ కూరగాయల పంటలు పండించాలని ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌ఛార్జి ఎం.స్వామి అన్నారు. శుక్రవారం కొణితివాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్త టి.సతీష్ కుమార్ స్థలంలో ఐపిఎం(ఎర్లీ వీక్ మనీ మోడల్) కూరగాయల సాగు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండల ఇన్‌ఛార్జ్ పి.దేవి నాగరాజు, ఐసిఆర్‌పిలు సతీష్ కుమార్, బి.శ్రీనివాస్, మురళీకుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

11న ప్రజానాట్యమండలిచే పాటల పోటీలు

ఆకివీడు: స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 11వ తేదీ ఆదివారం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పాఠశాలస్థాయి విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి షేక్ వలీ తెలిపారు. విద్యార్థులు, బాలబాలికలు, యువతరంలో దేశభక్తి భావాలు పెంపొందించాలనే లక్ష్యంతో అభ్యుదయ, దేశభక్తి గీతాలు, జానపద సినీగేయాల పోటీ జరుపుతున్నామన్నారు. అశ్లీలత లేని పాటలు మాత్రమే పాడవలసి ఉంటుందన్నారు. పాఠశాల హాస్టల్స్‌లో ఉన్నటువంటి ఔత్సాహిక గాయనీగాయకులకు ఈ అవకాశం కల్పిస్తున్నామన్నారు. రెండు స్థాయిల్లో ఈ పోటీలు ఉంటాయని, 15 సంవత్సరముల లోపు వారికి జూనియర్స్‌గాను, ఆపై వారికి సీనియర్స్ గాను రెండు భాగాలుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. స్థానిక జిల్లాపరిషత్ బాలుర హై స్కూల్ ఆవరణలో ఆదివారం ఉదయం పదిగంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. పదో తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అవసరమైన వారు 89496 51451, 9490098534 నెంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

కాళ్ల ఎస్‌ఐగా శ్రీనివాసరావు

కాళ్ల: కాళ్ల ఎస్‌ఐగా ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన వీరభద్రరావు బదిలీపై ముదినేపల్లి మండలం వెళ్లారు. పాలకోడేరు ఎస్‌ఐగా పనిచేసిన ఎన్.శ్రీనివాసరావు కాళ్ల ఎస్‌ఐగా వచ్చారు. ఎస్‌ఐ వీరభద్రరావు రిలీవ్ అయ్యారు. ఎస్‌ఐ శ్రీనివాసరావుకు బాధ్యతలు అప్పగించారు. పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా ఎస్‌ఐ శ్రీనివాసరావుకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు.

శాశ్వత ప్రాతిపాదికన జిఒ ఇవ్వాలి

కాళ్ల: ఉపాధ్యాయుల గ్రౌండ్ లెవెల్ నివేదికల ఆధారంగా టీచర్ సంఘాలతో చర్చలు జరిపి రేషనలైజేషన్ కోసం పర్మినెంట్ రూల్స్, జిఒలు తీసుకొని రావలసిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, ఎస్‌టియు జిల్లా జనరల్ సెక్రటరీ పెన్మెత్స సాయివర్మలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదనుగుణంగానే ఎప్పుడూ ఆ రూల్స్ ప్రకారమే జరిగేలా చూడాలని, ప్రభుత్వం ప్రభుత్వంకి వేరువేరుగా రూల్స్ మారిపోతున్నాయన్నారు. దీనివల్ల 3వ, 4వ కేటగిరిలలో ఎక్కువ సంవత్సరాలు పనిచేసి వచ్చిన ఉపాధ్యాయులు మళ్లీ మళ్లీ అదే స్థానాలలో పనిచేయవలసి వస్తుందన్నారు. దీనివల్ల ఎప్పుడూ ఒక్కరే పదే పదే నష్టపోతున్నారని తెలిపారు.

తణుకు ఎస్‌ఐగా చంద్రశేఖర్

తణుకు: తణుకు పట్టణ ఎస్‌ఐగా కె.చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఈయన గతంలో నరసాపురం, భీమవరం ట్రాఫిక్, నల్లజర్ల, పెంటపాడు, ఇరగవరం, సిసిఎస్ భీమవరం పోలీస్ స్టేషన్లో ఎస్‌ఐగా పనిచేశారు. తాజా బదిలీల్లో భాగంగా తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై తణుకు టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు.

కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ

గణపవరం: పిఎంపి అసోషియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం కాశిపాడులో కేన్సర్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సురేంద్రకుమార్ రెడ్డి, పిఎంపి అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్ కె.పరమేశ్వరులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల కేన్సర్ రావడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు పొగాకు, ధూమపానం, మారక ద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే రొమ్ము కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, లివర్ కేన్సర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆగస్టు 15 నుంచి కేన్సర్ స్కానింగ్ టెస్టులు అందరూ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కోట నాగేశ్వరరావు, ఎంపిటిసి జంపన రమేష్ రాజు, సొసైటీ ఎక్స్‌ఛైర్ పర్సన్ కోట సత్యనారాయణ, వైసిపి గ్రామ అధ్యక్షులు సిల్వర్ స్టార్ రాజు పాల్గొన్నారు.

దిరుసుమర్రు పంచాయతీలో అవకతవకలపై స్పందనలో ఫిర్యాదు

భీమవరం టౌన్: మండలంలోని దిరుసుమర్రు గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచి కోళ్ల బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఉప సర్పంచి అల్లూరి గంగాధర్ రాజు జులై ఒకటో తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులలో భాగంగా శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి నామేశ్వరరావు విచారణ చేపట్టారు. ఫిర్యాదారుడు చేసిన ఆరోపణపై పంచాయతీలో ఉన్న రికార్డులను ఆయన పరిశీలించారు. అయితే ఫిర్యాదు సమయంలో సర్పంచి కోళ్ల బాలకృష్ణ, గ్రామ కార్యదర్శి కృష్ణమోహన్ పంచాయతీలో ఎటువంటి అక్రమాలు జరగలేదని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ఫిర్యాదుదారుడు గంగరాజు మాట్లాడుతూ పంచాయతీలో ఎన్నో ఏళ్లుగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను నేటికీ కొనసాగిస్తున్నారని, అలాగే గ్రామంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదన్నారు. అంతేకాకుండా పారిశుధ్యం పేరుతో ఒక ఏజెన్సీకి ప్రతినెలా సుమారు రూ. 98 వేలు చెల్లిస్తున్నారని, అలాగే ప్రజల వద్ద నుంచి చెత్త పని రూపంలో ఇంటికి రూ.40 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి మీడియాతో మాట్లాడుతూ జిల్లా పంచాయతీ శాఖ అధికారి ఆదేశాల మేరకు తాను విచారానికి రావడం జరిగిందని, పూర్తిస్థాయి విచారణ చేపట్టి వారం రోజుల్లో నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

నాక్ స్వర్ణోత్సవాలకు పూర్వ విద్యార్థులు

ఆకివీడు: మరో 20 రోజులలో జరగబోతున్న నాక్ ఎంపిక, ఆపై త్వరలో రానున్న కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా ఈనెల 11వ తేదీ ఆదివారం కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేసినట్లు దుంపగడప వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి నాయకుడు గొంట్ల కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక వైద్య ప్రముఖులు కళాశాల ప్రణాళిక అభివృద్ధి సంఘ కార్యదర్శి డాక్టర్ బలరాం ప్రతాప్ కుమార్ ఆసుపత్రిలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి నాక్ గుర్తింపు అత్యంత అవసరమని, అందుకోసం అందరం కలిసి కృషిచేయాలని ఆయన కోరారు. సమిష్టి కృషితోనే ఎ ప్లస్ నాట్ సాధించగలుగుతామని అన్నారు. గతంలో సుమారు 12 సంవత్సరాల క్రితం ఈ కళాశాలకు న్యాయ కమిటీ బి కేడర్ ఇచ్చిందని, ఇప్పుడు ఎ క్యాడర్ సంపాదించవలసి ఉందన్నారు. అందుకోసం పూర్వ విద్యార్థులు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాలలో ఆదివారం ఉదయం 11 గంటలకు పూర్వ విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కళాశాల స్వర్ణోత్సవ వేడుకల గురించి చర్చించవలసి ఉందన్నారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులు, కళాశాల అభిమానులు, అలనాటి వ్యవస్థాపకులు చింతలపాటి మూర్తి రాజు, సన్నిహితులు, అందరూ హాజరు కావాలని కోరారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గర్భిణులు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ కె.సుబ్బలక్ష్మి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపులో భాగంగా శుక్రవారం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భం దాల్చిన మూడు నెలల నుంచి 9 నెలల వరకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. తల్లిపాలలో సంపూర్ణమైన పోషకాలు ఉన్నాయని, డబ్బా పాలు అంత మంచిది కాదని, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్స్, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'ఉద్యోగ దిక్సూచి'ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఈనెల 23న నరసాపురంలో నిర్వహించే 'ఉద్యోగ దిక్సూచి' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, నిరుద్యోగ యువత ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నరసాపురం వైఎన్ డిగ్రీ కళాశాలలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో అమర రాజా గ్రూప్, షిరిడి సాయి సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ, జగదీష్ మెరైన్, సంధ్యమెరైన్, సూర్యామిత్ర ఎగ్జిమ్ ప్రయివేట్ లిమిటెడ్, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, హెటిరో ఫార్మా, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, బ్లూ స్టార్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు మరికొన్ని ఇతర కంపెనీలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, టెస్టింగ్ డెవలపర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, సూపర్వైజర్, ఫార్మా అసిస్టెంట్, మెషిన్ ఆపరేటర్, లోన్ ఆఫీసర్ మొదలైన ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. వివిధ కంపెనీలలో సుమారు 450పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకోనేవారు 18 నుంచి 35 ఏళ్ల వయస్సు మధ్య కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని, కంపెనీల నిబంధనలను అనుసరించి ఎంపిక చేస్తారని, నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ లింకు %https//tinyurl.com/Placement-cell-WG% ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరములకు నాగేంద్ర 95020 24765, ప్రసన్న 70138 96277, రాధిక 94418 41622 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

అందరినీ విద్యావంతులు చేయడమే లక్ష్యం

అపోస్ జిల్లా సమన్వయకర్త సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆకివీడు

సంపూర్ణ అక్షరాసత ద్వారా అందరినీ విద్యావంతులను చేయడమే తమ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం జిల్లా సమన్వయకర్త ఎమ్ఎన్.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సార్వత్రిక విద్య ప్రాధాన్యతను తెలియజేస్తూ పట్టణంలోని హైస్కూల్ విద్యార్థులు అపోస్ విద్యార్థులతో విద్యాశాఖ, అపోస్ అధికారులు ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్ నుంచి పాత బస్టాండ్ మెయిన్ సెంటర్ మహాత్మా గాంధీ విగ్రహం వరకూ జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ అపోస్ ప్రాధాన్యతను వివరిస్తూ మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అపోస్ ద్వారా గత సంవత్సరం మార్చి జూన్ రెండు దఫాలు కలిపి మొత్తం 1,468 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారని, వారిలో 696 మంది పాస్ అయ్యారని తెలిపారు. కాగా ఇంటర్మీడియట్ రెండు దఫాలు మొత్తం 1,735 మంది పాసయ్యారని తెలిపారు. ఈ సంవత్సరం జూలై 31వ తేదీ నుంచి ప్రయివేట్‌గా పదవ తరగతి ఇంటర్మీడియట్ హాజరయ్యే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, సెప్టెంబర్ 4వ తేదీ వరకు స్వీకరిస్తామని తెలిపారు. మొత్తం ఇప్పటి వరకూ పదవ తరగతి ఫెయిల్ అయినవారు, ఇతరులు కలిపి డ్రాప్ అవుట్స్ 1,625 మంది ఉన్నారని, ఆ మొత్తం పదో తరగతి పరీక్షలకు రాయించాలనే లక్ష్యంతో ఉన్నామని అని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 వి.సీతారామయ్య, హెచ్‌ఎం పోతరాజు, అపోస్ అధికారి ఆశీర్వాదం, పాఠశాల ఉపాధ్యాయులు ఎం.వెంకటస్వామి పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - కాళ్ల

పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఇఒ-2

మండలంలోని కాళ్లకూరు ప్రాథమికోన్నత, కొత్తచెరువు ప్రాథమిక పాఠశాలను కాళ్ల ఎంఇఒ-2 వేంద్ర వెంకటేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టీని ఆయన పరిశీలించారు. విద్యార్థులచే పాఠ్యాంశాలను చదివారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం పాఠశాలను పరిశీలించడం జరిగింది. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు చక్కగా చదువుకున్నారని ఎంఇఒ-2 వేంద్ర వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా విద్యార్థుల పురోగతి, లెసన్ ప్లానింగ్, మధ్యాహ్న భోజన పథకంను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కాళ్లకూరు ప్రాథమికోన్నత, ప్రధానోపాధ్యాయులు బొర్రా రామకృష్ణ, కొత్తచెరువు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.రాధారాణి, సిఆర్‌పి ఎస్.వెంకన్నబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో ర్యాలీ

భీమవరం టౌన్: భారతీయులుగా ప్రతి పౌరుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయభావాలను చాటి చెప్పాలని హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సరిపిడకల రామారావు అన్నారు. శుక్రవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 78వ స్వాతంత్ర దినోత్సవం పక్షోత్సవాలలో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలో అభివృద్ధి కమిటీ, వెంకటేశ్వర స్వామి దేవస్థానం సహకారంతో ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేయాలంటూ ర్యాలీ, దేశభక్తి ప్రతిజ్ఞ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు భీమవరం పట్టణంలో ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని, మహాత్మాగాంధీ దండియాత్రను పురస్కరించుకుని అవగాహన ర్యాలీ చేపట్టామని అన్నారు. దేవస్థానం అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, అభివృద్ధి కమిటీ కార్యదర్శి జ్ఞానపాటి మధుసూదన్ రావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తాడికొండ కోటేశ్వరరావు, మడిపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ దండి సత్యాగ్రహంకు స్పందన ఇచ్చిందన్నారు. అనంతరం నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో అల్లూరి చిన బంగార్రాజు, కడలి వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

భవనాన్ని కేటాయించాలని వినతి

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం కార్యక్రమాలను నిర్వహించేందుకు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న భవనంను కేటాయించవలసిందిగా కోరుచూ విజ్ఞాపన పత్రాన్ని శుక్రవారం స్థానిక ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ కు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంపరాల నారాయణ మూర్తి, పట్టణ తాలూకా అధ్యక్షులు కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నాయ్యమూర్తి

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని నరసాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు అన్నారు. నరసాపురం పట్టణంలో జె.సికిలీ స్కూల్‌లో శుక్రవారం ఉత్తమ విద్యార్థులకు అవార్డులు అందించే కార్యక్రామానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. విద్యార్థి భవిష్యత్ నిర్మాణానికి క్రమశిక్షణ అవసరమన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల,పెద్దలను గౌరవించాలన్నారు. అనంతరం 2023-24 సంవత్సరంలో 7వ తరగతి, 12 తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 80 మంది విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్స్, గిఫ్ట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టి.శ్యామ్యూల్ బాబు, చదలవాడ జ్ఞాన ప్రకాష్, ప్రకాష్ రావు పాల్గొన్నారు.

తహశీల్దార్ అనితకుమారి బాధ్యతలు

ప్రజాశక్తి - పెనుగొండ

మండల తహశీల్దార్ అనిత కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనిత కుమారి మాట్లాడుతూ శుక్రవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీలో భాగంగా పెనుగొండ వచ్చారు. సర్పంచి మర్యాదపూర్వకంగా కలిశారు.

గణపవరం తహశీల్దార్‌గా అప్పారావు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం తహశీల్దార్‌గా వైకెవి.అప్పారావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. అప్పారావు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ నుంచి గణపవరం తహశీల్దార్‌గా వచ్చారు. ఇప్పటి వరకు తహశీల్దార్‌గా కొనసాగిన యడ్ల రాంబాబు కోనసీమ జిల్లా బదిలీ అయ్యారు.

పాస్‌పోర్టు పోయినది

తాటిపర్తి రామ్ బాబు తండ్రి : చిన్న రంగయ్య అను నేను పెనుమంట్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది మల్లిపూడి నుండి పెనుమంట్ర జిరాక్స్ సెంటర్‌కు వెళ్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది పాస్‌పోర్టు నెంబర్ : V4399229 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

అడ్రస్ : తాటిపర్తి రామ్ బాబు
తండ్రి : చిన్న రంగయ్య, డోర్ నెంబర్ : 4 - 31
పెనుమంట్ర మండలం, మల్లిపూడి
సెల్ : 8790728395

నోటీసు
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
FDIA.No.2/2022
in O.S.No.137/2014

Between:
శింగవరపు కుమారి ...Petitioner/Plaintiff
Vs
పోలిశెట్టి భాస్కరరావు ...Respondents/Defendant

To.
రెస్పాండెంట్/ప్రతివాది: పోలిశెట్టి భాస్కరరావు S/o.కృష్ణమూర్తి, కొప్పర్రు గ్రామము, నరసాపురం మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు దావాలో రెస్పాండెంటు హాజరు నిమిత్తము శ్రీకోర్టు వారు పై నెంబరు దావాను **ది.16-8-2024** తేదీకి వాయిదా వేసినారు. కాబట్టి రెస్పాండెంటు పై నెంబరు దావాలో **ది.16-8-2024వ తేదీన ఉ.10.30 లకు** స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ శ్రీకోర్టు వారు ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కానిచో రెస్పాండెంటును పరోక్షమందు పై నెంబరు దావా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరని తెల్పడమైనది.

కోర్టు వారు ఉత్తర్వుల మేరకు
పాలకొల్లు **యం.వెంకటరామారెడ్డి**
తేది.8-8-2024 అడ్వకేటు, పాలకొల్లు.

ప్రకటన

పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు గ్రామ కాపురస్తులు, పాలకొల్లు పల్లపువీధిలో డో.నెం. 17-2-15లో నివసిస్తున్న **వింజుమూరి రామకృష్ణ,** S/o. late **వెంకటరత్నం** అను నేను ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది.

యీ దిగువ షెడ్యూలు దాఖలా **డాక్యుమెంటు నెం. 4355/2000** రుగా రిజిష్టరు గాబడి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం, పాలకొల్లు సబ్-రిజిస్ట్రారులో చేరిన ఉల్లంపర్రు గ్రామపంచాయతీ ఏరియాలోని ఉల్లంపర్రు గ్రామం పార్వతి నగర్ తాలూక జిరాయితీ పల్లం ఆర్.ఎస్. నెం. 235/3, 236 దాఖలా 4.50 భూమిని ఉల్లంపర్రు పంచాయతి వారిచే 10-3-1983 తేదీన పి.ఆర్. నెం. 64/83 రుగా అప్రూవల్ కాబడిన లేఅవుట్ ప్లాను దాఖలా ప్లాటు నెం. 28లో 331-5లో పాత డో.నెం. 4-70/1, కొత్త డో.నెం. 4-121 ను దాఖలా ఆర్.సి.సి. డాబా యిల్లు రెల్లి గాడి యింటి హద్దులు.

తూర్పు: లేఅవుట్ రోడ్ - 44.0 Sft. **దక్షిణం:** ప్లాటు నెం. 29/బి చెరుకూరి వెంకటేశ్వరరావు గారి సత్రం - 62.05 Sft. **పడమర:** రోడ్డు - 40.45 Sft. **ఉత్తరం:** ప్లాటు నెం. 27 దాఖలా మాధవరావు స్థలం - 82.65 Sft.

ఈ హద్దుల మధ్య 330 చ॥మీ॥ 277.16 స్థలం, యిందలి ఆర్.సి.సి. డాబా ఇల్లు నాకు మాత్రమే దాఖలు పడి ఉన్నది. దీనిపై ఎవరు ఎటువంటి హక్కుదారులు అని గాని, వారసులు అని గాని, అమ్మకాలు, కొనుగోలు జరిగిన ఎడల అవి చెల్లనేరవు. అవి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొందును అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వింజుమూరి రామకృష్ణ
ప॥గో॥జిల్లా

IN THE HON'BLE COURT OF JUNIOR CIVIL JUDGE AT TEKKALI
OS. No. 19/2023

Between:- **Sri. Krishna Kamakshi Pharmacy** ...Petitioner
And:- **Bhagya Lakshmi Medical Agencies, Respresented by its proprietors** ...Respondents

GENERAL NOTICE

To;
1. Sri. Maddula Naga Venkata Ramesh, Proprietor: Bhagya Lakshmi Medical Agencies,Resident of D.No. 6-4-1/1, Kotipallivari street, Revenue ward No. 5, Narasapur, West Godavari District, A.P, PIN - 532275.
2. Sri. Balabhadra Santhosh, Proprietor: Bhagya Lakshmi Medical Agencies, Resident of D.No. 6-4-1/1, Kotipallivari street, Revenue ward No. 5, Narasapur, West Godavari District, A.P, PIN – 532275.

Please take the notice that the above matter is posted to dt: 30-08-2024 for your appearance and you are hereby directed to appear before the above Hon'ble Court on **Dt: 30-08-2024 at 10:30 A.M.,** either in person or through advocate without fail. Otherwise, the matter will be decided in your absence. Hence this notice.

//BY ORDER//

M.M. LAXMI, B. SRINIVAS RAO, P. MONICA,
ADVOCATE FOR THE PETITIONER, TEKKALI, CELL: 8074558590.

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.P.No.14/2022

Between :
చిలకలపూడి శ్రీను ...పిటీషనరు
Vs
1.బండి సత్యనారాయణ
2.కోట శేషుబాబు
3.The Official Receiver, West Godavari Dist., Eluru ...రెస్పాండెంట్లు

To.
1వ రెస్పాండెంట్ : బండి సత్యనారాయణ, తండ్రి సుబ్బారావు, డోర్‌నెం.2-117/2, స్కూల్ పెదమామిడిపల్లి గ్రామం, దిగమర్రు పోస్టు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు I.P లో పిటిషనరు, 1వ రెస్పాండెంట్ అయిన మిమ్ములను Insolvent గా Adjudge చేసి ది.26-07-2021 సం.తేదీన Under Document No.4380/2021 రున పాలకొల్లు సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో 2వ రెస్పాండెంట్ పేరున వ్రాసిన రిజిస్టర్ క్రియ దస్తావేజును రద్దు పర్చి పిటిషన్ 'B' షెడ్యూలు దాఖలా ఆస్తిని 3వ రెస్పాండెంట్ స్వాధీనం చేసుకొని ఆక్షన్ వేయించి సదరు ఆక్షన్ వేయ్యగా వచ్చిన సొమ్మును 'A' పిటిషన్ షెడ్యూలు దాఖలా ప్రామిసరీ నోట్ల బాకీలకు జమ చేయించుటకు గాను పిటిషనరు Insolvency Petition దాఖలు చెయ్యగా శ్రీకోర్టు వారు 1వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసులు పంపించమని ఉత్తర్వులు యిచ్చియున్నారు. శ్రీకోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం 1వ రెస్పాండెంట్ అయిన మీకు through కోర్టు మరియు రిజస్టర్ పోస్ట్ ద్వారా పలుమార్లు నోటీసులు పంపించినమా తీసుకోకుండా Avoid చేయుచున్నందున శ్రీకోర్టు వారు Substituted Service అయిన Paper Publication ద్వారా తెలియపర్చమని ఉత్తర్వులు యిచ్చియున్నారు. సదరు 1వ రెస్పాండెంట్ అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా ఈ ప్రకటన చూసుకొని **ది.19-08-2024** సం. తేదీన ఉదయం గం.10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల స్వయముగా గాని, న్యాయవాది గారి ద్వారా గాని తెలియచేసుకోవలెయును. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియచేయడమైనది.

Dr.**కొత్తపల్లి రమేష్** M.A.,B.Com.,LLB.,Ph.D.
అడ్వకేట్, నరసాపురం,
తేది.02-8-2024 సెల్: 9849021728

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో నరసాపురం, ప.గో.జిల్లా.
FDIA.No.1/2020 in O.S.156/2012

బిట్వీన్ :
1.శ్రీ గుబ్బల భవర దాస్ (Died)
2.శ్రీ గుబ్బల వెంకటేశ్వరరావు
3.శ్రీ గుబ్బల రామకృష్ణ ...పిటీషనర్లు
మరియు
1.గుబ్బల కబీర్ దాసు (Died)
2.శ్రీమతి గుబ్బల పెద్దంట్లు
3.గుబ్బల గణపతి
4.గుబ్బల సుందరరాజు
5.శ్రీమతి పితాని సత్యవతి
6.శ్రీమతి కుక్కల మంగ
7.శ్రీమతి పీతాని లక్ష్మి
8.శ్రీమతి పెచ్చెట్టి కుమారి ...రెస్పాండెంట్స్

నోటీసు

8వ రెస్పాండెంట్ :
శ్రీమతి పెచ్చెట్టి కుమారి, W/o.నాగేశ్వరరావు, డోర్‌నెం.1-33/2, శెట్టిబలిజపాలెం, చిన అయ్యప్పరోడ్డు, దొడ్డిపట్ల, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.

పై నంబరు ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినమా అమలు జరగనందున ఈ ప్రకటన ద్వారా అమలు నిమిత్తం ది.**02.09.2024**వ తేదీన మీరు ఉదయం గం. 10.30 నిమిషములకు శ్రీకోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు ఫైనల్ డిక్రీ పిటిషన్ పై మీ పరోక్షమున తీర్మానించబడును. గాన తెలియజేయడమైనది.

జిల్లెళ్ళ సైమన్ విజయకుమార్, బూసి చిట్టిబాబు
పిటీషనరు తరపు అడ్వకేట్స్,
స్థలం : నరసాపురం నరసాపురం.
తేది.09-08-2024 సెల్: 9290442260